విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 21, జూన్ 2024

క్షేత్ర స్థాయిలో పర్యటించిన కేంద్ర కరువు బృందం

రబీ 2023-24లో కరువు పరిస్థితిపై పరిశీలన

విశాలాంధ్ర-ఉరవకొండ: అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల గ్రామంలో రబీ 2023-24లో కరువు పరిస్థితిపై గురువారం కేంద్ర కరువు బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం లీడర్ (జాయింట్ సెక్రటరీ సిఈఓ, పి.ఎం.ఎఫ్.బి.వై డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్, న్యూఢిల్లీ) రితేష్‌చౌహాన్, హైదరాబాద్ డిటిఈ. ఆఫ్ ఆయిల్ సీడ్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ డా.కె.పొన్ను స్వామి, న్యూ ఢిల్లీ ఎంఎంసిఎఫ్సి డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సునీల్ దూబే, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా కరువు పరిస్థితిని అధికారులు ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీంకి వివరించారు. అనంతరం కరువు పరిస్థితులను రైతులు, అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి.సుభాకర్ మాట్లాడుతూ మండలంలో ప్రధాన పంట బెంగాల్ గ్రామ్ అని, ఈశాన్య రుతుపవనాల వైఫల్యం కారణంగా ప్రధానంగా నీటిపారుదల అవసరమైన సమయాల్లో తేమ లేకపోవడం వల్ల ప్రతికూలంగా ప్రభావితమైందన్నారు. దీని కారణంగా దిగుబడి తగ్గిందన్నారు. వివరాలు క్రాప్ కటింగ్, దిగుబడి ప్రయోగాల డేటాతో తెలియజేశారు.రైతు బి.రామాంజినేయులు ఐఎంసి టి టీమ్‌తో మాట్లాడారు. తన భూమిలో 1.05 ఎకరాల విస్తీర్ణంలో బెంగాల్ గ్రామ్ పంటను సాగు చేశానని, పంట కోసం ఎకరానికి రూ.28 వేలు ఖర్చు చేశానని, కానీ తేమ ఒత్తిడి కారణంగా పంట ప్రతికూలంగా ప్రభావితమైందన్నారు. రైతులకు సాయం అందించి ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని కోరారు..

ఈ విషయమై ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం లీడర్ రితేష్ చౌహాన్ స్పందించి ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం కోసం అందించిన ప్రతిపాదనలను రైతులకు తెలిపారు. కృష్ణారెడ్డి అనే రైతు మాట్లాడుతూ కరువు కాలంలో మంచి పాల ఉత్పత్తిని నిర్వహించడానికి తక్కువ ప్రీమియం రేటుకు దాణా, టిఎంఆర్ మరియు సైలేజ్ సరఫరా చేయాలని కోరారు. పశువుల దాణా వినియోగానికి మేలు చేసే టిఎంఆర్ దాణాను కూడా నాణ్యమైనది సరఫరా చేయాలని రైతు కోరారు. దాణాకు ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తున్నామన్నారు. పశువుల దాణా కోసం వరి గడ్డిని ఒక ట్రాక్టర్ లోడ్‌కు 8,000 వేలు ఖర్చు చేస్తున్నామని, జంతువులకు మేత అందించాలని అభ్యర్థించారు. గ్రామీణ నీటి సరఫరాకు సంబంధించి (ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కార్మికులు) పురుషోత్తం, నాగభూషణ మాట్లాడుతూ పైప్‌లైన్ రిపేర్లు, కరెంటు సమస్య వచ్చి, జీతాల కోసం సమ్మెకు దిగినప్పుడు నీటి సమస్య తలెత్తుతుంది, లేకపోతే నీటి సమస్య ఉండదన్నారు. రైతు హెచ్.వన్నూరు స్వామి మాట్లాడుతూ ఉపాధిహామీ జాబ్ కార్డ్ కింద 100 రోజుల పని పూర్తి చేశానని, మరో 50-60 రోజులు పని పెంచాలని కోరారు. ఇక్కడ వ్యవసాయ కూలీ పనులతో సహా తమకు ఏ పనీ రాదని, అలాగే పని వేతన బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. జాబ్ కార్డ్ కలిగిన వారు 100 రోజుల పనిని పూర్తి చేయాలని, పని దినాల సంఖ్యను పెంచడానికి ప్రయత్నిస్తామని ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం తెలిపింది. విధాన నిర్ణయాలు ప్రభుత్వానికి తెలుపుతామన్నారు. అనంతరం నింబగల్లు గ్రామం వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం పరిశీలించింది. వేసవిలో నీటి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడున్న మూడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఎండిపోయాయని అధికారులు కేంద్ర బృందానికి తెలియజేశారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసుల రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రహ్మణ్యం, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, డ్వామా పిడి వేణుగోపాల్ రెడ్డి, ఉద్యాన శాఖ డిడి రఘునాథరెడ్డి, ఏపీఎమ్ఐపి పిడి ఫిరోజ్ ఖాన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ భాష, డిఆర్డిఏ పీడీ నరసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతల నివారణకు యోగా దివ్యౌషధం

- ఎంపీ అంబికా నారాయణ
- అంతర్జాతీయ యోగా ర్యాలీని ప్రారంభించిన ఎంపీ

విశాలాంధ్ర-అనంతపురం : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ డిపార్ట్మెంట్, బ్రహ్మకుమారిస్, వివేకానంద యోగ కేంద్రం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ నుండి సప్తగిరి సర్కిల్ వరకు ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని గురువారం అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ప్రారంభించారు . ఈ ర్యాలీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణం నుంచి ప్రారంభమై టవర్ క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్కు చేరిఅక్కడి నుండి శ్రీకంఠం సర్కిల్ మీదుగా తిరిగి ఆర్ట్స్ కాలేజి ప్రాంగణానికి చేరింది. సుమారు 500 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రాచీన భారతదేశ సంప్రదాయం నుంచి వచ్చిన ఒక గొప్ప వరం యోగ. మనసు శరీరమును సమన్వయపరిచి పరిపూర్ణ ఆరోగ్యాన్ని మంచి భావాలను కలిగించేది యోగ. మానసిక సమస్యలను నివారిం చడంలో యోగా తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి,అనంతపురం ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ డిఎస్పి ముని రాజా, ఎస్కే యూనివర్సిటీ వారి రిజిస్ట్రార్, ఆయుష్ డిపార్ట్మెంట్ ఆయుష్ సీనియర్ వైద్యాధికారులు. డాక్టర్ రామకుమార్ డాక్టర్ రఫీక్, డాక్టర్ తిరుపతి నాయుడు, ఆయుష్ సిబ్బంది, బ్రహ్మకుమారి ఈశ్వరి విద్యాలయ సిస్టర్ సరళ, వివేకానంద యోగా కేంద్రం సభ్యులు, వివేకానంద యోగ కేంద్ర అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, యోగ మాస్టర్ వై.ఆంజనేయులు, ఈ ఎస్ మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న స్కూళ్లు సీజ్

- పాఠ్య పుస్తకాలు స్కూల్ పేర్లను బిల్డింగ్ ఫోటోలను వేసి అత్యధిక రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తప్పవు
- రాయదుర్గం ఎంఈఓ 2 రమేష్

విశాలాంధ్ర-రాయదుర్గం అర్బన్ : పాఠ్యపుస్తకాలను అంగడి సరుకుల అమ్ముతున్న ప్రైవేట్ స్కూల్‌లను గురువారం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఎంఈఓ విద్యాశాఖ అధికారి 2 రమేష్ సీజ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఏఐవైఎఫ్ తాలూకు అధ్యక్ష కార్యదర్శులు కుమార్ కొట్రేష్ మాట్లాడుతూ రాయదుర్గం పట్టణంలో ఉన్నటువంటి నారాయణ సెయింట్ పాల్ ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో పాఠ్య పుస్తకాలను అమ్ముతున్నారని తెలియడంతో విద్యార్థి యువజన సంఘాల నాయకులు అమ్ముతున్న స్కూల్ రూములను గమనించి విద్యాశాఖ అధికారీ అయిన రమేష్ చేత సీజ్ చేయించడం జరిగింది రాయదుర్గం పట్టణంలో ప్రైవేటు పాఠశాలలు కావచ్చు కార్పొరేట్ పాఠశాలలు కావచ్చు వారి పాఠశాల యొక్క భవనాల ఫోటోలను వారి పేర్లను పాఠ్యపుస్తకాలు మీద వేయించుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక రేటు ఉంటే వారు స్కూళ్లలో ఒక రేటు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు విద్యార్థుల తల్లిదండ్రుల రక్తం పీల్చుకుంటూ అత్యధికంగా ఫీజులు ఒక రేటు అసైన్మెంట్ పుస్తకాలు ఒక రేటు సిబిసి పుస్తకాలు అనీ ఒక రేటు ఎల్‌కేజీకీ 1850 నుంచి మొదలుకొని 6000 6500 వరకు పాఠ్య పుస్తకాలను అమ్ముతున్నారు వెంటనే ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్ల పై చర్యలు తీసుకొని ప్రభుత్వా నిబంధనల ప్రకారం. పాఠ్యపుస్తకాల మీద ఏ రేటు అయితే ఉంటుందో ఆ ప్రకారమే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందేలా విద్యాశాఖ అధికారులు చూడాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు కోరారు. లేని పక్షంలో ప్రత్యక్షం ఆందోళనకు దిగుతామని ఏఐఎస్ఎఫ్ తాలూకా కార్యదర్శి అంజనేయులు ఎస్ ఎఫ్ ఐ శివ కుమార్ ఏఐవైఎఫ్ తాలూకా కార్యదర్శి కోటేష్ విద్యార్థి యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిరక్షించండి...

విశాలాంధ్ర-తాడపత్రి: పట్టణంలోని తాహసిల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులు ఆధ్వర్యంలో అక్రమనకు గురైన వంక పోరంబోకు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని, పరిరక్షించా లని ధర్నా చేపట్టారు. అనంతరం తాహసిల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యల్లనూరు రోడ్డు చల్లవారి పల్లి గ్రామ పొలంలోని సర్వే నంబర్ 123-ఏ గల భూమి మూడు ఎకరాల 58 సెంట్ల భూమి కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని అగ్రకులస్తులైన అనంతపురంకు చెందిన సీమల సరళాదేవి, పెనుగొండకు చెందిన లింగొట్ల రవీంద్రనాథ్ అనే ఇద్దరు కబ్జా చేసి ముళ్ల కంచ వేస్తున్నారు. ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ భూమిని పట్టణ, గ్రామాల్లో నివసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలైన ఇండ్లు లేని నిరుపేదల కు ఇంటి పట్టాలు పంపిణీ చేసి ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మార్పీఎస్ పట్టణ ఇంచార్జ్ కొంటి గురప్ప, పట్టణ అధ్యక్షులు జూటూరు రామకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షులు డి. చంద్రశేఖర్ మహిళలు యశోద, ఓబులమ్మ, కుమారి, పెద్దలక్క, దేవి, శేషు, లక్ష్మీదేవి, సరస్వతి, రత్న పాల్గొన్నారు.

ఘనంగా రెవిన్యూ దినోత్సవం..

విశాలాంధ్ర-బొమ్మనహాల్: బొమ్మనహాల్‌లో గురువారం రెవిన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తాహశీల్దార్ రామాంజిమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతి ఏటా జూన్ 20న రెవిన్యూ దినోత్సవం జరపాలని ఉత్వర్వులీయడం హర్షణీయం అని తాహశీల్దార్ రామాంజిమ్మ అన్నారు. ప్రజలకు గుర్తుండే సేవలు అందించాలని ఏసమస్య వచ్చిన రెవిన్యూ శాఖనే గుర్తుండేదని అన్నారు. 1768లో రెవిన్యూ బోర్డు స్థాపించారు అని గుర్తు చేశారు. సీనియర్ వీఆర్ఎలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో డీప్యూటి తాహశీల్దార్ సుజాత, ప్రధానోపాధ్యాయులు రాజుకుమార్, సర్వేయర్ రవితేజ, ఆర్ఐ, బాలకృష్ణ, విఆర్ఓ నరసింహమూర్తి, సుజాత పాల్గొన్నారు.

పెళ్లి కోసం దాచిన నగదు, బంగారం చోరీ

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: మరో వారం రోజుల్లో కుమారుడి పెళ్లి. అప్పుచేసి ఇంట్లో దాచిన నగదు బంగారం గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం నారాయణపురంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటన గ్రామంలో చర్చనీ అంశమైంది. నారాయణపురం గ్రామానికి చెందిన చాకలి ఆదినారాయణ గోవిందమ్మ కుమారుడి పెళ్లి వారం రోజుల్లో జరుగునుంది. పెళ్లి ఖర్చులకు రూ.2,65,000 నగదు, మూడు తులాల బంగారం చేయించి ఇంట్లో దాచుకున్నారు. పక్కా సమాచారం తెలుసుకున్న దొంగలు కుటుంబ యజమానులు ఇద్దరు గురువారం రాత్రి ఇంటి పైన నిద్రిస్తుండగా ఇంటి తలుపులు పగులగొట్టి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. ఉదయాన్నే ఇంట్లోకి వచ్చిన ఆదినారాయణ జరిగిన సంఘటన చూసి అవాక్కయ్యాడు. తమ కుమారుడి పెళ్లి కోసం దాచి ఉంచిన నగదు బంగారం ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మలేరియా డెంగీపై అవగాహన

విశాలాంధ్ర-యాడికి: మలేరియా, డెంగీ వ్యాధులపై యాడికి మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు గురువారం ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ పాఠశాల మరియు హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని, ఎక్కడైనా నీటి నిల్వ ఉంటే వాటిలో ఆయిల్ బాల్స్ వేయాలని వీలైనంత వరకు దోమతెరలు వాడుకొని గోరువెచ్చని నీటిని త్రాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, సూపర్ వైజర్ షబ్బీర్, ఆరోగ్య కార్యకర్త నాగరాజు, కేజీబీవీ ప్రిన్సిపాల్ నిర్మల, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మారుతి పాల్గొన్నారు.

విశాలాంధ్ర వార్తకు స్పందన

స్పందించి గుంతను పూడ్చివేసిన అధికారులు..

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని శ్రీనివాసపురం, ఓగేటి పెట్రోల్ బంక్ సమీరా వాటర్ ప్లాంట్ ఎదురుగా గుంతను పూడిచేవారు లేరా అని విశాలాంధ్ర పత్రికలో గురువారం వార్త ప్రచురణ అయింది. దీంతో నేషనల్ హైవే అధికారులు స్పందించి గుంతను పూడ్చి వేశారు. ఈ ప్రాంతంలోని ప్రజలు, వాహన చోదకులు విశాలాంధ్ర పత్రికలో వార్త ప్రచురణ అవ్వడం వల్ల అధికారులు స్పందించి గుంతను పూర్చడంతో విశాలాంధ్ర ప్రత్యేక కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి .. ఏపీసీ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త వైఖోమ్ నిదియా దేవి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఆమె వజ్రకరూరు మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులతో ముచ్చటించారు అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం అయ్యారు. ఏపీసి మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడం ద్వారా పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. పిల్లలు ఉత్తమ పౌరులుగా ఎదగడంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని గుర్తు చేశారు. కొద్దిసేపు ఉపాధ్యాయునిగా విద్యార్థులకు గణితం బోధించారు. ఐఎఫ్పి ప్యానల్స్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో అనేక విషయాలు ముచ్చటించారు. అనంతరం స్టూడెంట్ కిట్స్ వజ్రకరూరు మండల స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. కిట్స్ సకాలంలో విద్యార్థులకు చేరాలని ఎంఈఓ తిమ్మప్ప, ఎర్రిస్వామి లను ఆదేశించారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన కార్యదర్శి

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయాన్ని గురువారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి సంబంధించిన పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. అలాగే గ్రంథాలయం పన్ను వసూల గురించి ఈఓఆర్డీతో చర్చించారు. గ్రంథాలయ అధికారిని హెచ్.ఉషారాణి పాఠకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పదేళ్ళ బాలుడిని తండ్రికి అప్పగింత..

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండలో పదేళ్ల బాలుడు మాసిన గుడ్డలతో స్థానిక బస్టాండులో గత రాత్రి తిరుగుతూ ఉండగా స్థానిక అర్బన్ సీఐ సురేష్ బాబు, ఎస్సై రాఘవేంద్రప్ప, పీసీ కుల శేఖర్ ఆ బాలుడుని విచారించగా తన వివరాలు చెప్పలేక పోయాడు. దీంతో ఆ బాలుడిని పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి భోజనం పెట్టి అక్కడే పడుకోబెట్టుకున్నారు. ఉదయం ఆపద్బాంధవ ట్రస్ట్ వారికి సమాచారాన్ని ఇవ్వగా వారు ఆ బాలుడి ఆచూకీ వివరా లను ఎట్టకేలకు కనుగొన్నారు. బాలుడికి తండ్రి, ఇద్దరు అన్నలు, ఒక తమ్ముడు ఉన్నాడని తల్లి లేదని ఇందిరానగర్ నందు నివాసం ఉంటారని తెలుసుకుని స్థానికుల ద్వారా తండ్రికి సమాచారాన్ని ఇచ్చి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బాలుడిని తండ్రికి అప్పజెప్పి తండ్రికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో బాబుని తనతోనే జాగ్రత్తగా పెట్టుకుంటానని తెలిపారు. అనంతరం సీఐ సురేష్ బాబు, ఎస్సై రాఘవేంద్రప్ప ఆపద్బాంధవ ట్రస్ట్ సభ్యులను అభినందించారు.

పాల్తూరులో నేను బడికి పోతా కార్యక్రమం

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రభుత్వ పాఠశాలలో నూరుశాతం ప్రవేశాలకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని విడపనకల్లు మండలం పాల్తూరు మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు గొర్తి వెంకటస్వామి కోరారు. ఆరేళ్ల నుంచి 14 సంవత్సరాల వయసున్న పిల్లలు చదువుకు దూరమయ్యే పరిస్థితి లేకుండా చేయాలన్నారు. బడిబయట వున్నవారిని గుర్తించి వారికి తిరిగి ప్రవేశాలు కల్పించడం ప్రధాన బాధ్యత అన్నారు. గురువారం గ్రామంలో "నేను బడికి పోతా" కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ జూన్ 13 నుంచి జూలై 12 వరకూ నెలరోజుల పాటు పలు కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. సమన్వయ సమావేశాలు, ప్రభుత్వ బడుల్లో పిల్లలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరణ గోడపత్రికలు, వివిధ మాధ్యమాల ప్రచారం, ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించామన్నారు. జూలై 11 వరకూ వివిధ స్థాయిల్లో బృందసభ్యుల ర్యాలీలు, సభలు, అవగాహన సదస్సులు వుంటాయన్నారు. ఆరేళ్ల నుంచి 14 సంవత్సరాల లోపున్న పిల్లలను గుర్తించే ప్రక్రియ సమిష్టిగా కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పడ్డాయన్నారు. గ్రామస్థాయిలో తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, పంచాయితీ కార్యదర్శి, సిఆర్పీ, సచివాలయ సంక్షేమాధికారి, అంగన్ వాడీ సిబ్బంది సభ్యులుగా వున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్తూరు మెయిన్ స్కూల్ టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు, ప్రజలకు నిరంతరం అందుబాటులో రెవెన్యూ శాఖ

విశాలాంధ్ర-శింగనమల: రైతులు. ప్రజలకు అందుబాటులో ఉండినిరంతర సేవలో రెవిన్యూ శాఖ పనిచేస్తుందని శింగనమలతహ సీల్దార్ శోభన్ బాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శోభన్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకం దించే అనేక సంక్షేమ పథకాలకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు రెవిన్యూ శాఖ ఇవ్వాల్సి ఉంటుందని. ఇతర అన్ని శాఖలతో కలిసి రెవిన్యూ శాఖ పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణ. భూములు పంపిణీ, ఇంటి పట్టాలు పంపిణీ, లాంటి అనేక కీలక పనులు కూడా రెవిన్యూ శాఖ నిర్వహిస్తుందన్నారు. కాలానుగుణంగా రెవెన్యూ శాఖలో కూడా అనేక మార్పులు జరిగాయని, దాని కనుగొనంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ ప్రకాష్ రావు, ఈ.డి.టి రామకృష్ణ. మండల సర్వేయర్ గోవిందరాజులు. ఆర్ ఐ హనుమా ప్రసాద్ సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, వీఆర్వోలు. సర్వేయర్లు రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయడంపై హర్షం..

విశాలాంధ్ర-శింగనమల: ఉద్యాన పంటలకు ఉపాధి హామీ పథకం అనుసంధానం చేసినందుకు గిరిజన గ్రామాల్లో పంచాయతీ భవనాలు నిర్మించినందుకు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బొమ్మన పురుషోత్తమ రెడ్డి సింగనమల నియోజకవర్గం ఇన్చార్జి సాకే మురళీకృష్ణలు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా నిన్న ఆయన క్యాంప్ ఆఫీసులో బాధ్యతలు తీసుకున్న సందర్భంగా గ్రామీణ అభివృద్ధికి సంబంధించి ఉద్యానపంట లకు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానిస్తూ మొదటి సంతకంమరియు గిరిజన ప్రాంతాల్లో పంచాయతీ భవనాలు నిర్మించడానికి రెండవ సంతకం చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు, ఉప ముఖ్య మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే సంతకం చేయడం ఒక రైతుబిడ్డగా గర్విస్తున్నామని తెలియజేశారు. ఉద్యాన పంటలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించినందుకు, రైతులు రైతు కూలీలు, ధన్యవాదాలు తెలిపారు.

బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ

విశాలాంధ్ర- శింగనమల: మండల పరిధిలోని తరిమెల బాలుర వసతి గృహాన్ని గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి రమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో కావలసిన వసతులపై మరమ్మ తులపై అక్కడ ఉన్న వార్డెన్ బసవరాజును అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ మొత్తం కలియతిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు, హాస్టల్ స్థితిగతులపై ఎంపీడీవో.బి, వి రమణ అసహనం వ్యక్తం చేశారు, అక్కడున్న వసతులపై కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు,

నిరంతరం ప్రజా సేవలో రెవన్యూ శాఖ

విశాలాంధ్ర-కూడేరు: మండల తాహసిల్దార్ కార్యాలయం నందు రెవెన్యూ డే సందర్భంగా గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైతుల ప్రజల నిరంతర సేవలో రెవిన్యూ శాఖ పనిచేస్తుందని తాహసిల్దార్ రత్న రాధిక తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు రెవిన్యూ శాఖ ఇవ్వాల్సి ఉంటుందని. ఇతర అన్ని శాఖలతో కలిసి రెవిన్యూ శాఖ పనిచేయాల్సి ఉంటుందని. ఎన్నికల నిర్వహణ. భూములు పంపిణీ. ఇంటి పట్టాలు పంపిణీ లాంటి కీలక పనులు కూడా రెవిన్యూ శాఖ నిర్వహిస్తుందన్నారు. కాలానుగుణంగా రెవెన్యూ శాఖలో కూడా అనేక మార్పులు జరిగాయన్నారు. ఈ సందర్భంగా గతంలో కూడేరు మండల తాసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగి డిప్యూటీ తాసిల్దార్ బషీర్ అహ్మద్,ఆర్ ఐమురళి,గోటుకూరు గ్రామ పరిపాలన అధికారి రిటైర్డ్ రామచంద్రారెడ్డి, వీరికి మండల తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించడం జరిగింది కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ విశ్వనాథ్, రీ సర్వే డ్యూటీ విజయకుమార్, ఆర్ ఐ ప్రసన్నకుమార్, సి ఎస్ డి టి కనకరాజు, వీఆర్వోలు రమేష్ స్వామి, ఓబులేసు, రుక్మిణి,లక్ష్మన్న, గోపాల్,రవి, నాగన్న, రామకృష్ణ,సాయి, వెంకట నరసయ్య వీఆర్ఏలు, జ్ఞానేశ్, ఓబన్న, రామాంజనేయులు, వన్నూరు స్వామి, అటెండర్లు రామాంజనేయులు, హేమంత్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం

ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి.

విశాలాంధ్ర-ధర్మవరం : యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గురువారం ఆర్‌డిఓ వెంకట శివరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 21వ తేదీ శుక్రవారం అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా పలు విషయాలను ప్రజలకు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా యోగాకు మంచి ఆదరణ ఉంది అని, వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా యోగ చేసిన ఎడల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు చక్కటి మనశ్శాంతి కూడా లభిస్తుందని తెలిపారు. యోగ కేవలం శారీరిక భంగిమలు మాత్రమే కాదు అని,ఎందుకంటే ఇది శ్వాస వ్యాయాయాలు ధ్యానం, నైతిక సూత్రాలను ఏకీకృతం చేసే ఆరోగ్యానికి సంపూర్ణమైన విధానము అని తెలిపారు. యోగ సాధన వల్ల కలిగే అనేక ప్రయోజనాలను ప్రజలు తప్పనిసరిగా అవగాహన చేసుకోవాలని తెలిపారు. మానసిక, శారీరక శ్రేయస్సుపై దృష్టి సారించే ఈ ప్రాచీన భారతీయ యోగా అభ్యాసాన్ని ప్రతి ఒక్కరూ అభ్యసించారని తెలిపారు. యోగ అనేది మనసు శరీరాన్ని సమన్వయం చేసే ఒక బ్యాలెన్స్ చర్యగా ఊహించాలని ఆలోచనలు చర్యతో సమలేఖనం చేస్తుందని తెలిపారు. వ్యక్తిగత నెరవేర్పుతో క్రమశిక్షణను ఏకం చేస్తుందని, శారీరక, మానసిక ,ఆధ్యాత్మిక, ఆత్మ అంశాలను ఏకీకృతం చేయడం ద్వారా యోగ ఆరోగ్యము శ్రేయస్సుకు సంపూర్ణ మార్గాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో వేగవంతమైన జీవితాలలో శాంతికి చాలా అవసరమైన మూలం యోగా అని, యోగా ఆసనాల అభ్యాసం బలం ఆవశ్యకతను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. యోగా చేయడం వల్ల నరాలను ఉపశమనం చేస్తూ, మనసుకు ప్రశాంతిని చేకూర్చుతుందని తెలిపారు. అంతేకాకుండా ఆసనాల కండరాలు కీళ్లు, చర్మం, మొత్తం శరీరాన్ని ప్రభావితం చేస్తాయని, గ్రంధులు, నరాలు, అంతర్గత అవయవాలు ఎముకలు, శ్వాసక్రియ మెదడు యోగా ద్వారా సరి అయిన క్రమంలో పని చేస్తాయని తెలిపారు. యోగా అనేది ఒత్తిడి, ఆందోళన, నిరాశను నిర్వహించడానికి, తగ్గించడానికి సమర్థవంతమైన పద్ధతి యోగానే అని తెలిపారు. అంతేకాకుండా ప్రజలందరూ ఉదయాన్నే యోగ చేయడం వల్ల శరీరం చాలా చురుకుగా ఉంటుందని తెలిపారు. యోగ గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని బలము సమతుల్యత ఆవశ్యకతను మెరుగుపరుస్తుందని, నిద్రపోవడానికి యోగా మీకు విశ్రాంతిని కూడా ఇస్తుందని తెలిపారు. కావున యోగా విషయములు నిర్లక్ష్యం అనేది మంచి పద్ధతి కాదని వారు తెలియజేశారు.

బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత డీఎస్సీ కోచింగ్

- కోచింగ్‌కు దస్త్రంపై తొలి సంతకం
- ఎన్టీఆర్ విదేశీ విద్య పథకం కొనసాగింపుపై రెండో సంతకం
- వారంలో ఒక్కరోజైనా చేనేత వస్త్రాలు ధరించాలని ప్రజలకు విజ్ఞప్తి
- త్వరలో బిసి కమిషన్ ఏర్పాటు...
- రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖల మంత్రి సవిత

విశాలాంధ్ర-పెనుకొండ : రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిళ్లలో వెనకబడిన తరగతుల విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ అందించే దస్త్రంపై తొలి సంతకంతో రాష్ట్ర వెనకబడిన తరగతుల సంక్షేమం, ఇడబ్ల్యుఎం, చేనేత జౌళి శాఖల మంత్రిగా సవిత బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు గురువారం రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనంలో ఆమె మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత డీఎస్సీ కోచింగ్, ఎన్టీఆర్ విదేశీ విద్య పథకం కొనసాగింపు పథకాలపై మొదటి,ద్వితీయ సంతకాలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ ఫైల్ పై తొలి సంతకం చేశారని, ఆయన అడుగుజాడల్లో వెనకబడిన తరగతుల్లోని నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఫైల్ పై తొలి సంతకం చేశానన్నారు. అదే విధంగా 2014-19లో 2173 మందికి విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించిన ఎన్టీఆర్ విదేశీ విద్య పథకాన్ని కొనసాగించనున్నామని మంత్రి సవిత పేర్కొన్నారు. వెనకబడిన తరగతుల సంక్షేమం కోసం త్వరలోనే బీసీ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.2014-19 లో ఉమ్మడి 13 జిల్లాలకు మంజూరు చేసిన బీసీ భవన్ ల నిర్మాణాలను సైతం పూర్తి చేస్తామన్నారు.ఈ ప్రభుత్వంలో చేనేత కళాకారులు,హస్త కళాకారులకు తగిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు.వారానికి ఒక్కసారైనా సచివాలయ ఉద్యోగులు, రాష్ట్ర ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాలని విజ్ఞప్తి చేశారు.బీసీ కులానికి చెందిన మహిళకు వెనకబడిన తరగతుల మంత్రిగా అవకాశం ఇచ్చినం దుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. విభజన నాటికి రాష్ట్రంలో ఉన్న 32 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలను 106 పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదే అన్నారు. రాష్ట్రం బాగుండాలనే తపన కలిగిన వ్యక్తి ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. దేశానికి బీసీ నాయకుడు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో తనకు బీసీ సంక్షేమ శాఖకు మంత్రిగా పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

ఇంటి ముంగిటకు కిరాణా సౌకర్యం తెచ్చిన అమేజాన్ ఫ్రెష్

విశాలాంధ్ర- కదిరి : పండ్లు, కూరగాయలు, చిల్డ్ ఉత్పత్తులు, సౌందర్యం, బేబీ, పర్శనల్ కేర్, పెట్ ఉత్పత్తులు, ఇతర నిత్యావసరాలు వంటి తడి పొడి కిరాణా సరుకుల ఫుల్-బాస్కెట్ కిరాణా సరుకుల సర్వీస్ అమేజాన్ ఫ్రెష్ 130ం నగరాలకు విస్తరించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అమేజాన్ ఇండియా. అమేజాన్ ఫ్రెష్ సెల్లర్స్ పండ్లు మరియు కూరగాయలను 11,000కి పైగా రైతుల నుండి సేకరిస్తారన్నారు. '4-స్టెప్ నాణ్యతా తనిఖీ' ద్వారా ఉత్పత్తి నాణ్యతను నిర్ధారిస్తారన్నారు. అంబాలా, ఔరంగాబాద్, హెూషియార్ పూర్, ధార్వాడ్, ఉనా, సూరి వంటి 130ం నగరాల్లో కస్టమర్స్ గొప్ప ఆదాలు ఆనందిస్తారన్నారు. ఇతరులు తమ వారపు/నెలవారీ బాస్కెట్ ను రూపొందిస్తున్నప్పుడు అమేజాన్ ఫ్రెష్ సెల్లర్స్, బ్యాంక్ భాగస్వాముల నుండి ఉత్తేజభరితమైన డీల్స్ పొందుతారన్నారు.

డైరెక్టర్, అమేజాన్ ఫ్రెషన్ ఇన్ "అమేజాన్ ఫ్రెష్ శ్రీకాంత్ శ్రీ రామ్ మాట్లాడుతూ భారతదేశంలో కిరాణా షాపింగ్ ను పునః రూపుదిద్దుతోందన్నారు. ఇంకా, కస్టమర్స్ క్యాష్ బాక్, ఆఫర్స్, మరియు బ్యాంక్ డిస్కౌంట్స్ నుండి ప్రయోజనాలు పొందవచ్చు, తమ ప్రతి కొనుగోలుకు విలువను చేరుస్తుందన్నారు. అమేజాన్ ఫ్రెష్ కిరాణా సరుకుల కోసం అమేజాన్.ఇన్‌పై ప్రత్యేకమైన యాప్-ఇన్-యాప్‌తో సులభమైన షాపింగ్ అనుభవాన్ని మరియు తరచుగా షాపింగ్ చేసిన వస్తువులు చెక్ అవుట్ సమయంలో మర్చిపోకుండా వ్యక్తిగత విడ్ గెట్స్, బై గైన్ ఆప్షన్, మరియు రిమైండర్స్ వంటి సౌకర్యవంతమైన ఫీచర్స్ అందిస్తుందన్నారు. ప్రతి నెల 1 నుండి 7 వరకు సూపర్ వేల్యూ డేస్ తో కస్టమర్స్ తమ నెలవారీ బాస్కెట్ ను విలువతో రూపొందించుకోవచ్చన్నారు.

27 నుంచి అంతర్ జిల్లాల హాకీ పోటీలు

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 27వ తేదీ నుండి 30వ తేదీ వరకు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో హాకీ ఆంధ్రప్రదేశ్ సౌజన్యంతో, హాకీ సత్యసాయి జిల్లా వారి ఆధ్వర్యంలో 14వ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల హాకీ పోటీలను నిర్వహిస్తున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు సూర్యప్రకాష్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సీనియర్ హాకీ పోటీలలో 20 జిల్లా జట్లు పాల్గొంటున్నాయని ఈ పోటీలలో పాల్గొని జిల్లా నుండి సుమారు 40 మందిని అత్యంత నైపుణ్యత ఘనపరిచిన క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కోచింగ్ క్యాంపు నిర్వహించి హాకీ ఆంధ్రప్రదేశ్ జట్టును ఎంపిక చేసి, నవంబర్ పూణేలో జరిగే జాతీయ హాకీ పోటీలలో హాకీ ఆంధ్రప్రదేశ్ సీనియర్ పురుషుల హాకీ జట్టు పాల్గొంటుందని తెలిపారు.

అర్హులైన పేదలకు పట్టాలి ఇచ్చి తీరాలి

విశాలాంధ్ర-కదిరి: కదిరి పట్టణంలోని అర్హులైన నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేయాలని ఏఐటియుసి మధు నాయక్, సిపిఐ పట్టణ కార్యదర్శి లియాకత్ పేర్కొన్నారు. గత 20 రోజుల నుండి ఇల్లు లేని నిరుపేదలకు న్యాయం జరగాలంటూ వేయి పగలు పరదాలు వేసుకుని న్యాయం చేయాలని భారత్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు ధర్నాలు చేసినప్పటికీ తమకు న్యాయం జరగలేదని పలువురు రెవెన్యూ అధికారులపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలకు న్యాయం చెయ్యాలని చేయలేని పక్షంలో భారత్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పోరాడడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు రమణ, నారాయణ భాష వినాయత్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మవారిపల్లి వాటర్ ట్యాంక్‌లో కోతులు మృతి

- ఆ నీటినే సరఫరా చేశారని గ్రామస్తులు ఆందోళన.. - పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-పుట్టపర్తి : మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కమ్మవారిపల్లిలో గల త్రాగునీటి సరఫరా ట్యాంకులో 10 కోతులు పడి మృతి చెందగా ఆ నీటిని గ్రామానికి సరఫరా చేశారని గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. గురువారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. కోతులు మృతి చెందిన త్రాగునీటిని వదిలిన వాటర్ మెయిన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ అంజయ్యకు ఫిర్యాదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన కమిషనర్ హుటాహుటిన ఆ గ్రామానికి వెళ్లి తన సిబ్బందితో బ్యాంకులోని నీటిని వదిలి వేయించారు. అయితే అక్కడ మృతి చెందిన కోతి పిల్లలు కనిపించలేదు. పక్కనే ఉన్న సత్యసాయి త్రాగునీటి సరఫరా ట్యాంకులో పరిశీలించారు. అక్కడ మృతి చెందిన ఒక కోతి కనిపించింది. ఒక కోతి అక్కడ నుంచి బయటకు వచ్చింది. కమిషనర్ పరిశీలించిన తరువాత ఆ ట్యాంకు కు చాలా రోజుల నుంచి నీరు వదలడం లేదని తేలింది. నీరే లేకుంటే ఎలా నీరు వదలుతారని గ్రామస్తులకు వివరించినట్లు కమిషనర్ తెలిపారు. కోతులు మృతి చెందిన ట్యాంకు నీటిని త్రాగలేదని తేలినందున గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. వారి అనుమానం దీంతో తీరిపోయింది.

30న ఉచిత మెగా హెల్త్ క్యాంపు

విశాలాంధ్ర-ధర్మవరం: జిల్లా ఆర్యవైశ్య సంఘం హిందూపురం ఆర్యవైశ్య సంఘం సహకారంతోనే హిందూపురంలోని శ్రీ వాసవి ధర్మశాలలో జిల్లా ఆర్యవైశ్య సంఘం హాస్టర్ ఆర్‌వి హాస్పిటల్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కలవల నాగతేజ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులు ఇటువంటి క్యాంపును సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలని తెలిపారు. నిష్ణాతులైన, వైద్యులచే అన్ని జబ్బులకు సరియైన వైద్య చికిత్సలను అందించడంతోపాటు ఆరోగ్య సూత్రాలను కూడా వివరించడం జరుగుతుందన్నారు.

సేవా కార్యక్రమంతో ఎంతో సంతృప్తి

విశాలాంధ్ర-ధర్మవరం: సేవా కార్యక్రమంలో నిర్వహించడంలో ఎంతో సంతృప్తి సంతోషం ఉంటుందని శ్రీ సత్య సాయి భజన మండలి పాత భజన మందిర నిర్వాహకులు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 200 మంది రోగులకు పాలు, బ్రెడ్డు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి దాతలుగా పోడమల రాగని వారి కుటుంబ సభ్యులు నిర్వహించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆసుపత్రి సూపర్డెంట్ మాధవి మాట్లాడుతూ శ్రీ సత్యసాయి భజన మండలి వారు చేస్తున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిని ఇస్తాయని తెలిపారు. భజన మండలి పాత భజన మందిరం సత్యసాయి వాలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఏపీఆర్ఈఐ సంస్థ సంయుక్త కార్యదర్శి

విశాలాంధ్ర-పరిగి: మండల పరిధి లోని కోడిగెనహళ్లి గురుకుల పాఠశాలను ఏపీఆర్ఈఐ సంయుక్త కార్యదర్శి ఉబేదుల్లా సందర్శించినట్లు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్‌బాబు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీధర్ బాబు మాట్లాడుతూ ఏపీ ఆర్ఈఐ ఉబేదుల్లా ఉదయం అసెంబ్లీకి హాజరైనట్లు తెలిపారు. ఏపీ ఆర్ ఈ ఐ సంయుక్త కార్యదర్శి ఉబేదుల్లా మాట్లాడుతూ 2023-24 సంవత్సరం 10వ తరగతి పరీక్షలలో నూటికి నూరు శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడంతోపాటు రాష్ట్రస్థాయిలో మూడు ర్యాంకులను సాధించినందుకు ఎంతో సంతోషంగా ఉందని, విద్యార్థులకు వారికి చదువు చెప్పిన గురువులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తగా ఐదవ తరగతిలో చేరిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల దైనందిక కార్యక్రమాలలో భాగంగా సూర్యోదయానికి ముందు నిద్రలేచి యోగ, ధ్యానము, మానసిక వికాసం పెంపొందించుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

పాత ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఓపిలు నిర్వహిస్తాం

ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పాత ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోనే ఇకనుంచి ఓపీలను నిర్వహించడం జరుగుతుందని ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ మాధవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా పోతుకుంట పోలీస్ స్టేషన్ వద్ద ఆసుపత్రిని ప్రారంభించడం జరిగిందని, అప్పట్లో అక్కడే ఓపిని చూడటం జరుగుతుండేదని, కానీ రోగులు యొక్క కష్టాలను, ఇబ్బందులను తెలుసుకొని పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 వరకు తప్పనిసరిగా ఓపీలు రోగుల కొరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మిగిలిన వైద్య విభాగాల పనులను నూతన ప్రభుత్వ ఆసుపత్రిలోనే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున పట్టణ, గ్రామీణ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని వారు కోరారు. సూపర్డెంట్ నిర్ణయం పట్ల రోగులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. రోగులు కూడా మాట్లాడుతూ నూతన ప్రభుత్వ ఆసుపత్రికి ఓపిక వెళ్లాలంటే రవాణా ఖర్చులు రోజుకు 20 లేదా 30 రూపాయలు ఖర్చు అవుతుందని. అందుకే కొంతమంది వెళ్లలేక పోవాల్సి వస్తుందని తెలిపారు. ఏది ఏమైనా ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ నిర్ణయం పట్ల పట్టణ, గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాయితీపై విగ్రహాల పంపిణీ ..

విశాలాంధ్ర-ధర్మవరం: తిరుమల తిరుపతి దేవస్థానం వారు కొన్నేళ్లుగా నూతనంగా నిర్మించు దేవాలయాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రాంతాలకు విగ్రహాలను రాయితీయులపై పంపిణీ చేస్తూ హిందూ ధర్మ సంస్కృతి సాంప్రదాయాలను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా బొమ్మనహల్లి గ్రామం కళ్ళు దేవరహల్లి అనే గ్రామంలో గల దేవాలయానికి తిరుమల, తిరుపతి దేవస్థానం వారు చెన్నకేశవ స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి విగ్రహాలను టీటీడీ తరఫున పంపిణీ చేశారని, టీటీడీ ధర్మాచార్యులు నక్కల వెంకటేశులు తెలిపారు. గ్రామ దేవాలయ కమిటీ టీటీడీ వారికి, నక్కల వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

మంత్రి సవితమ్మను కలసిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర-గోరంట్ల: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మరియు హ్యాండ్ లూమ్, టెక్స్ టైల్ శాఖామంత్రి పెనుకొండ శాసనసభ్యురాలు ఎస్. సవితమ్మను విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో గోరంట్ల మండలంలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సవిత్రమ్మ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించారని, పెనుకొండ, సోమందేపల్లి తదితర పట్టణాలలో అన్నదాన శిబిరాలు అన్న క్యాంటీన్ నిర్వహించి పేద ప్రజలకు నిత్యం అన్నం పెట్టారన్నారు. కరోనా సమయంలో కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారని కొనియాడారు. టిడిపి సీనియర్ నాయకులు బాలకృష్ణ చౌదరి, మాజీ సర్పంచులు ఉత్తమ రెడ్డి,నరేష్ కుమార్ పాల్గొన్నారు.

29న జాతీయ మెగా లోక్ అదాలత్

విశాలాంధ్ర-పెనుకొండ : ఈనెల 29న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జ్ వాసుదేవన్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ తో రాజీ కాదగిన సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేసుకొనేలా కక్షిదారులను ప్రోత్సహించాలని సూచించారు. మెగా లోక్ అదాలత్ వల్ల కక్షదారులకు డబ్బు సమయం వృధా కాకుండా ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జ్ ఎం.బుజ్జప్ప అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ముజీబ్ ఫాసాల సయ్యద్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గోరంట్లలో రెవెన్యూడే...

విశాలాంధ్ర-గోరంట్ల: రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 81 మేరకు 20వ తేదీన రెవెన్యూ దేగా గుర్తింపు ఇవ్వడంతో గోరంట్ల మండలం తహశీల్దార్ కార్యాలయం నందు రెవెన్యూ దేను తహశీల్దార్ అక్బల్ భాషా మరియు డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థ ప్రాముఖ్యతను వివరించారు. పూర్వం 250 సంవత్సరాల నాటికే ఈ వ్యవస్థ ఒకటి ఉన్నదని అప్పటికే భూములు పై పన్ను విధించడం జరిగిందన్నారు, ఇప్పటి రెవెన్యూ వ్యవస్థలోదాదాపుగా అన్ని డిపార్ట్మెంట్లు , అన్ని చట్టాలు కూడా దాదాపుగా రెవెన్యూ వ్యవస్థకు అనుసంధానమై ఉన్నాయని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థ అన్ని వ్యవస్థలలోని ముఖ్య అధికారులకు ప్రోటోకాల్ అందిస్తుందని, అటువంటి వ్యవస్థ దేశంలో ఒక్క రెవెన్యూ వ్యవస్థ మాత్రమే ఉందన్నారు. కనుక ఈ వ్యవస్థను మదర్ డిపార్ట్మెంట్ అని కూడా అనవచ్చని తెలియజేశారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామ రెవెన్యూ సహాయకులు సిబ్బంది పాల్గొన్నారు,

100 వక్క మొక్కలను పెరికేసిన గుర్తుతెలియని వ్యక్తులు...

నిందితులను కఠినంగా శిక్షించాలి : మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

విశాలాంధ్ర-రొళ్ల: మండల పరిధిలోని బంద్రేపల్లి గ్రామానికి చెందిన రైతు కిష్టప్ప సర్వే నెంబర్ 371-1 పొలంలో గత20 రోజుల క్రితం వక్క మొక్కలు నాటారు. అయితే బుధవారం రాత్రి దాదాపు 100 మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు పీకేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బాధితుని పొలం వద్ద చేరుకొని తొలగించిన మొక్కలను పరిశీలించారు. తొందరగా నిందితుడిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. అసలే వర్షాలు తక్కువ అందులో అరకొరనీటితో అప్పులు చేసి మొక్కలు నాటితే వాటిని పీకివేయడం అతి దారుణమని తెలిపారు ఇలాంటి విష సంస్కృతిని మన నియోజకవర్గంలో పునరావృతం కాకూడదని హెచ్చరించారు.

దీర్ఘకాలిక వ్యాధితో బాధ పడుతున్న వ్యక్తిని పరామర్శించిన గుడుమల...ఎం.రాయపురం గ్రామంలో నివాసం ఉంటున్న కమలమ్మ గత కొన్ని సంవత్సరాల నుండి పక్షవాతంతో బాధ పడుతున్నది. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బాధితురాలిని పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, తెదేపా మండల కార్యదర్శి ఈరన్న,టిఎన్టియూసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి,మాజీ వైస్.ఎంపిపి సిద్ధగంగప్ప,తెలుగు యువత అధ్యక్షులు హెూట్టేబెట్ట భరత్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, మారన్న, నాగేంద్ర, రామకృష్ణ నాగరాజు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే వేడుకలు....

విశాలాంధ్ర-ధర్మవరం: రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరరావు పిలుపుమేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డిఓ కార్యాలయంలో రెవెన్యూ దేను ఘనంగా రెవెన్యూ ఉద్యోగులు నిర్వహించుకున్నారు. ముఖ్యఅతిథిగా ఆర్డీవో ఎం. వెంకట శివరామిరెడ్డి హాజరై పలు రెవెన్యూ సేవలను కొనియాడారు. అనంతరం వారు మాట్లాడుతూ 20/6/1786 లో రెవెన్యూ డిపార్ట్మెంట్ అని నామకరణం చేసి గుర్తించబడిదని తెలిపారు. రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ఎంతో బాధ్యతాయుతంగా పని చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. 238 ఏళ్ల తర్వాత ఏపీలో రెవెన్యూ దే ఏర్పాటైందని, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రెవెన్యూ పరిధిలో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ దే రోజున పదవీ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులను తప్పనిసరిగా సన్మానించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రిటైర్డ్ తాసిల్దార్ వెంకటేశులును ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, ఆర్‌డిఓ, ధర్మారం తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది సత్కరించారు. నియోజకవర్గంలోని తాసిల్దార్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం.. 60 వేలు నష్టం

విశాలాంధ్ర-రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గొల్లహట్టి గ్రామానికి చెందిన రైతు సన్ననాగప్పకు చెందిన గడ్డివాము బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధిత రైతు సన్ననాగప్ప తెలిపారు. రొళ్ల మండలం ఆర్.గొల్లహట్టి గ్రామంలో రైతు సన్ననాగప్పకు చెందిన గడ్డివామి రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. ఉదయం 6.00 గంటల సమయంలో రైతు గమనించారు. అప్పటికే పూర్తిగా దగ్ధమైపోయిందని రైతు తెలిపాడు. దాదాపు సుమారు 3లోడు గడ్డి అగ్ని ఆహుతికి పూర్తిగా దగ్ధమైంది 60,000రూ.నష్టం జరిగిందని రైతు తెలిపారు. రెండు నెలల క్రితం కేబుల్ వైరు దొంగతనం జరిగిందని,అనుమానం ఉన్న వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.రైతు తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఎన్ఎస్ఎస్ విభాగాన్ని సందర్శించిన మాజీ భారత రాయబారి

విశాలాంధ్ర-పెనుకొండ: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాన్ని భారత మాజీ రాయబారి రోమెల్ సందర్శించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగే పలు సేవా కార్యక్రమాల్లో ఎంతో చురుగ్గా పాల్గొనే ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పుట్టపర్తి లో జరిగే పలు సేవా కార్యక్రమాల్లో సైతం పాల్గొనడం అభినంద నీయమన్నారు. కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరూ గ్రామీణ నేపథ్యం ఉన్నప్పటికీ, ఎంతో క్రమశిక్షణతో సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్న అధ్యాపకు లను ఆయన అభినందించారు. చక్కటి వాతావరణంలో నెలకొన్న కళాశాలలోని విద్యార్థులకు మరింత వ్యక్తిత్వ వికాసాన్ని నెలకొల్పాలని కళాశాల ప్రిన్సిపాల్‌కి విజ్ఞప్తి చేశారు. పుట్టపర్తిలో త్వరలో జరిగే పర్తి యాత్రకు విద్యార్థులు అధ్యాపకులతో హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపల్ కేశవ్ రావ్‌ని ప్రత్యేకంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సత్య సాయివిశ్వ విద్యాలయ పూర్వ విద్యార్థులు దినేష్, కరుణాకర్, సత్యసాయి సమితి పెనుకొండ కన్వీనర్ శంకర్, కళాశాల అధ్యాపకులు ప్రతాప్, రామన్న, ఎన్ఎస్ఎస్ అధికారి రంగనాయకులు పాల్గొన్నారు.

'ఎన్టీఆర్ సుజల స్రవంతి'కి భూమిపూజ

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల మండలం మలసముద్రం పంచాయతీ, జక్కసముద్రం గ్రామంలో ఎన్టీఆర్ సృజల స్రవంతి త్రాగునీటి పథ కానికి గురువారం సర్పంచ్ సువర్ణ-అశ్వర్థరెడ్డి, ఉప సర్పంచ్ కమలాకర్‌రెడ్డి భూమి పూజ చేశారు. పంచాయతీ సెక్రటరీ సంయుక్త,వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హరి మిత్ర గంగాధర్ మల సముద్రం పంచాయతీ తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 21, జూన్ 2024

రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారు

విశాలాంధ్ర– ధర్మవరం: రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణ దానం అవుతుందని సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రశాల ప్రసన్న కుమార్, సోలిగాళ్ళ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాంస్కృతిక మండలి లో శ్రీ చౌడేశ్వరి సేవా సమితి బీ రే శ్రీరాములు, రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. సత్రశాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ళ వెంకటేశులు రక్తదాన శిబిరాన్ని విజయ వంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం రక్తం కొరత అధికంగా ఉందని, అవగాహన కల్పించుకుని రక్తదానం ఇవ్వటలో ఆసక్తి చూపాలని తెలిపారు. 32 మంది రక్తదానం చేయగా వీరందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బీరే శ్రీరాములు కేతా లోకేష్, బోనాల శివయ్య, పడికేరి నాగరాజు, ఉమ్మడిశెట్టి ప్రసాద్, మేకల శివయ్య, దాసరి శివశంకర్ పాల్గొన్నారు.

యోగాకు ఆదరణ పెరుగోతోంది

-21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
- డా.శ్రీలత కన్సల్టెంట్ ఫిజియో థెరపిస్టు

విశాలాంధ్ర–అనంతపురం: యోగా, సంస్కృత పదం "యుజ్" నుండి ఉద్భవించింది, దీని అర్థం "యోక్" లేదా "ఐక్యం". ఇది కేవలం శారీరక భంగిమలు మాత్రమే కాదు, ఎందుకంటే ఇది శ్వాస వ్యాయామాలు, ధ్యానం మరియు నైతిక సూత్రాలను ఏకీకృతం చేసే ఆరోగ్యానికి సంపూర్ణమైన విధానం. యోగా సాధన వల్ల కలిగే అనేక ప్రయోజనాల గురించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మానసిక మరియు శారీరక శ్రేయస్సుపై దృష్టి సారించే ఈ ప్రాచీన భారతీయ అభ్యాసాన్ని గుర్తించే రోజు ఇది. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా యోగాకు ఆదరణ బాగా పెరిగింది. యోగా అనేది మనస్సు మరియు శరీరాన్ని సమన్వయం చేసే ఒక బ్యాలెన్సింగ్ చర్యగా ఊహించండి, ఆలోచనను చర్యతో సమలేఖనం చేస్తుంది మరియు వ్యక్తిగత నెరవేర్పుతో క్రమశిక్షణను ఏకం చేస్తుంది. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక మరియు ఆత్మ అంశాలను ఏకీకృతం చేయడం ద్వారా యోగా ఆరోగ్యం మరియు శ్రేయస్సుకు సంపూర్ణ మార్గాన్ని అందిస్తుంది. ఇది మన వేగవంతమైన జీవితాలలో శాంతికి చాలా అవసరమైన మూలం. యోగా ఆసనాల అభ్యాసం బలం మరియు వశ్యతను అభివృద్ధి చేస్తుంది. అదే సమయంలో మీ నరాలను ఉపశమనం చేస్తుంది మరియు మీ మనస్సును ప్రశాంతపరుస్తుంది. ఆసనాలు కండరాలు, కీళ్ళు, చర్మం మరియు మొత్తం శరీరాన్ని ప్రభావితం చేస్తాయి. గ్రంథులు, నరాలు, అంతర్గత అవయవాలు, ఎముకలు, శ్వాసక్రియ మరియు మెదడు యోగా ద్వారా సరైన క్రమంలో పనిచేస్తాయి. యోగా ఒత్తిడి, ఆందోళన మరియు నిరాశను నిర్వహించడానికి మరియు తగ్గించడానికి సమర్థవంతమైన పద్ధతిని అందిస్తుంది మరియు అనేక అధ్యయనాలు మానసిక స్థితి-సంబంధిత రుగ్మతలపై యోగా యొక్క సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయి. సాధారణంగా, యోగాభ్యాసం ఉదయం లేదా సాయంత్రం ప్రారంభంలో చేయవచ్చు. ఉదయం యోగా సెషన్ చాలా చురుకుగా ఉంటుంది. యోగా వల్ల కలిగే లాభాలు 1. యోగా వెన్నునొప్పి నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది.

2. యోగా ఆర్థరైటిస్ లక్షణాలను తగ్గించగలదు. 3. యోగా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. 4. యోగా బలం, సమతుల్యత మరియు వశ్యతను మెరుగుపరుస్తుంది. 5. మీరు బాగా నిద్రపోవడానికి యోగా మీకు విశ్రాంతినిస్తుంది. 6. యోగా అంటే మరింత శక్తి మరియు ప్రకాశవంతమైన మనోభావాలు. 7. ఒత్తిడిని నియంత్రించడంలో యోగా మీకు సహాయపడుతుంది. 8. యోగా మిమ్మల్ని సహాయక సంఘంతో కలుపుతుంది. 9. యోగా మెరుగైన స్వీయ సంరక్షణను ప్రోత్సహిస్తుంది.

నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం

విశాలాంధ్ర -రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలో గత వైస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే అనుచరులు గుమ్మగట్ట మండల కన్వీనర్, గొల్లపల్లి వైస్సార్సీపీ నాయకులు జగనన్న లేవుట్ అక్రమాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని, భూ భాధితులకు న్యాయం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ స్టేట్ సెక్రెటరీ చిందనూరు నాగరాజు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని పత్రికా సమావేశంలో డిమాండ్ చేశారు. రాయదుర్గం పట్టణ సమీపంలో బీటీపీ రోడ్డులో జగనన్న లేవుట్ ల కోసం కొంతమంది రైతులతో తక్కువ ధరలకే భూములను అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసి వైస్సార్సీపీ ప్రభుత్వ నికి ఎమ్మెల్యే అండ దండలతో ఎక్కువ సొమ్ములకు ప్రభుత్వానికి అంటగట్టారన్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో గురువారం భూ భాధితులను తహసీల్దార్ చిట్టిబాబు విచారించారు, అనంతరం అక్రమ భూ దందా పై న్యాయ న్యాయాలను విచారించి సంబంబంధిత జిల్లా అధికారులకు అక్రమార్కులపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పట్టణానికి చెందిన బీటీపీ రోడ్డులో సర్వే నంబర్ 36-ఏలో మండి చిన్న సిద్దప్ప, మండి సిద్దమ్మ ల నుండి నాలుగు ఎకరాల యాభై రెండు సెంట్ల భూమిని ఒక ఎకరా ఎనిమిది లక్షల రూపాయల తక్కువ ధరకే కొనుగోలు చేశారన్నారు. కోదండ శ్రీనివాసులు సర్వే నంబర్ 435-ఏలో నాలుగు ఎకరాల ముప్పై సెంట్ల ఇందులో ఒక ఎకర పన్నెండు లక్షల అరవై వెలతో, నాయకుల శివశంకర్ నుండిసర్వేనంబర్48-ఏ, నాయకులసత్యమ్మసర్వేనంబర్ 48-ఏ, ఇందులో కూడా ఒక ఎకరం ధర ఏడు లక్షల ప్రకారం వైఎస్ఆర్ నాయకులు అగ్రిమెంట్ ద్వారా రైతులకు తక్కువ ధరలకే కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు ప్రభుత్వానికి విక్రయించి అక్రమంగా ప్రభుత్వ ధనాన్ని కబ్జా చేశారని ఆవేద వ్యక్తం చేశారు ఈ భూ మాయతో రాయదుర్గంనియోజకవర్గంలో పలు గ్రామాలలో జగనన్న లేవుట్ ల కోసం చాలా మంది రైతులతో తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు అమ్ముకొని సొమ్ములు చేసుకొన్నా వైనం దుర్మార్గమైన చర్యగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో బడుగు బలహీన వర్గాల పేద ప్రజల కోసం జగనన్న లేవుట్ లలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించింది, రైతులను మోసం చేసి నయవంచనతో తక్కువ ధరలకే అగ్రిమెంట్ చేసుకొని వారి ప్రభుత్వనీకె ఎక్కువ ధరలకు అమ్ముకొని కొట్లాది రూపాయలు వైస్సార్సీపీ నాయకులు ఖాతాలలో జమ చేసుకోవడం దుర్మార్గమైన చర్య చర్య అన్నారు. కలెక్టర్ ఫిర్యాదు చేశామని జగనన్న లేవుట్‌ల అక్రమాల పై ఎంత పెద్ద నాయకులు ఉన్నా న్యాయం జరిగేంత వరకు మా పార్టీ పోరాడుతుందని తెలిపారు.

క్రీడలుతో మానసిక శారీరక దృఢత్వం..

- ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

విశాలాంధ్ర–కదిరి: విద్యార్థినీ విద్యార్థులకు క్రీడలో మానసిక శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు.పట్టణంలోని నారాయణ పాఠశాల విద్యార్థి రామ్ చరణ్ అంతర్జాతీయ కరాటే పోటీలో ప్రతిభ చాటగా విద్యార్థికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.నాలుగు సంవత్సరాల నుంచి మార్షల్ ఆర్ట్స్ లో రామ్ చరణ్ శిక్షణ పొంది కరాటే లో జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయభేరి మోగించాడని మాస్టర్ అక్బర్ అలీ తెలిపారు.కఠోర శిక్షణ పొంది వైట్ బెల్ట్ నుంచి బ్లాక్ బెల్ట్ వరకు శిక్షణ ఇచ్చిన మాస్టర్ అలీ కి విద్యార్థి తల్లి దండ్రులు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో కరాటే కోచ్ రియాజ్ అలీ ఖాన్ వసుంధర, హారిక పాల్గొన్నారు.

అన్నదాత ను ఆదుకోండి..

కరవు బృందానికి టీడీపీ నేతల విన్నపం

విశాలాంధ్ర–కళ్యాణదుర్గం: గడిచిన నాలుగు సంవత్సరాలుగా ఏటా కరువుతో సతమతమవుతున్న అనంతపురం జిల్లా రైతాంగ అన్ని విధాల ఆదుకోవాలని కేంద్ర కరువు బృందానికి టిడిపి నాయకులు విన్నవించారు గురువారం జిల్లాలో పర్యటిస్తున్న కరువు బృందాన్ని కలిసిన కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తనయుడు జశ్వంత్ చౌదరి నియోజకవర్గంలో రైతాంగ సమస్యలను ఏ కరువు పెట్టారు. తాగునీరు, సాగునీరు లేక నియోజకవర్గంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కేంద్రం విరివిగా సహాయం చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర–బొమ్మనహాల్: మండలంలోని లింగదహాల్ గ్రామంలో వైద్యాధికారులు కుమార్ రాజు, గీత భార్గవి ఆదేశానుసారం గురువారం సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థుల తో ర్యాలి ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. "దోమలు పుట్టకూడదు, దోమలు కుట్ట కూడదు", "పరిశుభ్రత పాటిద్దాం, ఆరోగ్యంగా జీవిద్దాం" అన్న నినాదాలతో, వర్షాలు పడుతుండడంతో నీరు నిల్వ లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డ్రై డే పాటించాలని, ఇంటి కిటికీలకు వైర్ మెస్ వేయించుకోవాలని, పాత టెంకాయ చిప్పలు, టైర్లు, పూల కుండీలు కాల్చి వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రాత్రి వేళల్లో దోమతేరలు వాడాలన్నారు. నిల్వ ప్రాంతాలలో దోమ లార్వా నివారించేందుకు ముందుస్తు చర్యలలో భాగంగా అబైట్ స్ప్రే చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఎచ్.ఎం.లత, నాగరాజు, అనిల్‌కుమార్ ,సూపర్వైజర్ ఉమాదేవి ,ఎం.ఎల్.ఎచ్.పీ అలివేలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీతను కలిసిన ఎస్కేయూ రెక్టార్



విశాలాంధ్ర–రాప్తాడు: అనంతపురంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి నూతన రెక్టారుగా నియమితులైన ఎస్కేయూ ఎకనామిక్స్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు గురువారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆమె నివాసానికి వెళ్లి కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్కేయూ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. రెక్టార్ వెంట రిజిస్ట్రార్ ఎంవి లక్ష్మయ్య ఉన్నారు.

మర్యాద పూర్వకంగా మంత్రిని కలిసిన బీజేపీ నేతలు

విశాలాంధ్ర–పెనుకొండ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మను గురువారం పేనుకొండ నియోజకవర్గం బిజెపి జిల్లా కార్యదర్శి యనమల రామకృష్ణ బండారు నాగప్ప తదితరులు విజయవాడ వెళ్లి ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి మర్యాదపూర్వకంగా పెన్నులు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ యాదవ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర–గోరంట్ల: గోరంట్ల పట్టణం లోని చంద్రశేఖర్ థియేటర్ వద్ద గురువారం గోరంట్ల గ్రామాభ్యుద మహిళా మండలి అధ్యక్షురాలు లాయర్ రమా పావని రాయల్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మాజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు,వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హిందూపురం పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల శ్రీ ఆశ్రయ హాస్పిటల్ వారి సహకారంతో డాక్టర్ పరిసే హరీష్, డాక్టర్ శరత్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాసన్ రెడ్డి, డాక్టర్ వేణుమాధవ్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ మస్తాన్ సిబ్బంది సహకారంతో అన్ని రకాల జబ్బులకు ఉచిత ట్రీట్మెంట్ మరియు మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పరీక్షించి అవసరమైన మేరకు హాస్పిటల్లో అడ్మిట్ చేసుకోవడానికి ఉచిత వెహికల్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలుగుదేశం నాయకుడు 1-వార్డు మెంబర్ నాగరాజు, తెలుగుదేశం నాయకులు పట్టణ అధ్యక్షుడు కక్కల రఘునాథ్ రెడ్డి, సీనియర్ నాయకుడు,ఎల్ ఎన్ నారాయణ స్వామి, డిఎ శ్రీనివాసులు, పూలేరు మాజీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు గాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, చిన్నారనులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర–ఉరవకొండ: మల్లెల వరలక్ష్మి మూడవ వర్ధంతి సందర్భంగా మల్లెల వరలక్ష్మి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉరవకొండ పట్టణంలోని విఠల్ రుక్మిణి వృద్ధ ఆశ్రమంలోని వృద్ధులకు మరియు రాజమ్మ చిన్న పిల్లల అనాథ ఆశ్రమంలోని పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మీ భర్త మల్లెల శివ ప్రసాద్, ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు డా. ఎన్. రంగ స్వామి, అధ్యక్షులు మల్లెల ఫణీంద్ర, కార్యదర్శి సింగాడి దుర్గ ప్రసాద్ మరియు ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

మేలైన పంటపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర–గుడిబండ: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం అగ్రికల్చర్ డీఏ సనావుల మండలంలోని రైతులకు మేలైన పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా డిఎపి రైతులు పంటలకు వాడడం వల్ల కలిగే లాభాలు వేరుశనగ, రాగి, మొక్కజొన్న, కంది, పత్తి పంటలలో పాటించవలసిన మేలైన సాగు పద్ధతులను అలాగే వేరుశెనగ పంటకు ప్రత్యామ్నాయంగా ఆముదం, కంది వంటి పంటలను పండించాలని కోరారు. అనంతరం ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరిగా రైతులు చేసుకోవాల్సిందిగా అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ డిఏ సనావుల, మండల వ్యవసాయ అధికారి వీర నరేష్, ఏఈఓలు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది మండలంలోని రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మంత్రి సవితమ్మకు అభినందనల వెల్లువ...

విశాలాంధ్ర–పెనుకొండ : పెనుకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం సంపాదించిన బీసీ సంక్షేమ చేనేత శాఖామంత్రిగా గురువారం బాధ్యతలు చేపట్టిన సవితమ్మకు సచివాలయ భవనంలోనే అనేక మంది ప్రముఖులు అధికారులు అభిమానులు ఎమ్మెల్యేలు ఎంపీలు రాష్ట్రస్థాయి నుంచి నాయకులు వచ్చి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, సురేంద్రబాబు, నక్క ఆనందబాబు, మరియు జిల్లా అధ్యక్షులు అంజన్నప్ప, వెంకట శివుడు యాదవ్, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ,నియోజకవర్గం నుంచి శ్రీరామ్ యాదవ్ ,సిద్దయ్య ,నరహరి, చిన్న వెంకటరాముడు, సుబ్బరత్నమ్మ, గాండ్ల విశాలాక్షి, సుబ్బారెడ్డి, దాదు, హనుమన్న, తదితర నాయకులు బిజెపి నాయకులు రామకృష్ణ, తదితరులు వెళ్లి మంత్రి సవితమ్మకు అభినందనలు తెలిపారు.

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన చరిత్రకారులు మైనస్వామి

విశాలాంధ్ర–పెనుకొండ : పెనుకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి గురువారం బాధ్యతలు చేపట్టిన సవితమ్మను ప్రముఖ చరిత్రకారులు మైనస్వామి అమరావతిలోని సచివాలయం నాలుగవ బ్లాకులు మర్యాదపూర్వ కలిసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్.బి.కెలో అవకతవకలు,...

ఈ అధికారి మాకొద్దు బాబోయ్,..

విశాలాంధ్ర–చిలమత్తూర్ రూరల్: మండల పరిధిలోని చాగలేరు పంచాయతీ ఆర్ బి కే కేంద్రంలో అవకతవకల నడుమ వేరుసెనగ పంపిణీ చేపట్టారని, ఆర్.బి.కె వ్యవసాయ అధికారి మనోహర్ మాకొద్దు బాబోయ్ అని రైతులు అంటున్నారు. ఇప్పటివరకు చాగలేరు పంచాయతీలో ఏ రైతుకు కూడా ఇనుపుట్ సబ్సిడీ గానీ, ప్రభుత్వ రాయితీ రుణాల, విత్తనాలు ఎరువులు, క్రిమిసంహారక మందులు కానీ రైతులకు అందిన పాపాన పోలేదు, ఈ వ్యవసాయ అధికారి మా గ్రామంలో ఉండే వరకు మా గ్రామానికి ఏ రైతుకు లబ్ధి చేకూరదని తెలియజేస్తున్నారు, ముఖ్యంగా సబ్సిడీ వేరుశనగ విషయంలో అవకతవకలు చేసి రాత్రికి రాత్రి వేరుశనగ ఇతర రాష్ట్రాలకు తరలించినట్లు రైతుల వాపోతున్నారు, ముందుగా రైతుల వేరుశనగ కొనుగోలు కోసం రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు చెల్లించిన వారికి వచ్చిన వేరుశనగను, అరకొరగా అందించి వచ్చినది ఇంతే అంటూ చేతులు దులుపుకొని ఇతరులకు పక్కదారికి మళ్ళించి సొమ్ము చేసుకున్నట్లు రైతులు తెలుపుతున్నారు, ఇప్పటివరకు ఇతను సకాలంలో ఆర్బికే కేంద్రానికి రాకుండా ఉన్నత అధికారులు అండదండలతో కాలయాపన చేస్తూ నెలసరి వేతనం తీసుకుంటూ పబ్బం గడుపుతున్నట్లు సమాచారం, ఎప్పుడు వస్తాడో ఎప్పుడు వెళతాడో దేవుడికే ఎరుక అంటూ కన్నీరు మున్నూరు అవుతున్న గ్రామ రైతులు, కావున ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి చాగలేరు పంచాయతీ రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు రైతులు, మేధావులు చర్చించుకుంటున్నారు.

నల్లమాడలో 'నేనుబడికి పోతా'

విశాలాంధ–నల్లమాడ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమం గురువారం నిర్వహించారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులు పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యా యుడు భాస్కరరెడ్డి మాట్లాడుతూ విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ, బడి బయట వున్న పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మండల విద్యాధికారి, సీఆర్పీలు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షి ఎస్ఐ గోపికి ఎస్పీ అభినందనలు..

విశాలాంధ్ర–లేపాక్షి : ఎన్నికల విధుల్లో బాధ్యతగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టిన లేపాక్షి ఎస్సై గోపిని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు. జరిగిన శాసనసభ పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘాతో లేపాక్షి మండలంలో ప్రశాంత వాతావరణంలో జరిగిన ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేకంగా అభినందించి ఉత్తమ అవార్డును అందజేశారు..

నూర్ భాషా (దూదేకుల) ముస్లిమ్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గొడుగు అమీర్

విశాలాంధ్ర–ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలం నాగులగుబ్బ గ్రామంలో నివాసముంటున్న గొడుగు అమీర్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ భాషా దూదేకుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా నియమితులైనట్లు గొడుగు అమీర్ తెలిపారు తెలిపారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ భాషా (దూదేకుల) ముస్లిమ్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఓతూరి. రసూల్, ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు తెలిపారు నూర్ భాషా దూదేకుల ముస్లింస్ సంక్షేమ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఒక ప్రకటనలో తెలిపారు.

బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండాలి

విశాలాంధ్ర–కూడేరు : మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల యందు మనం బడికి పోదాం కార్యక్రమం జరుగుతున్నది. జూన్ 13వ తేదీ నుండి జూలై 12వరకు ఈ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతున్నది. గురువారం కమ్మూరు ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాల యందు నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు, ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి 2,సాయి కృష్ణ మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని ఐదు సంవత్సరాలకు పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలుఖ్ఎ నమోదు చేయించాలని తెలిపారు. మొదట ర్యాలీగా బయలుదేరి కార్యక్రమంపై గ్రామాలలో అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరడం వల్ల విద్యావంతులైన ఉపాధ్యాయులచే బోధన జరుగుతున్నదని పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, నోట్ బుక్స్, బూట్లు, బెల్టులు, ఇలా స్టూడెంట్‌కు సంబంధించినకిట్టును ప్రతి పేద విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

ముదిగుబ్బ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

విశాలాంధ్ర–ముదిగుబ్బ : రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్య కుమార్, ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ముదిగుబ్బ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని టిడిపి ముదిగుబ్బ మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మండలంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫల అయ్యింది. ఎన్నికల సమయంలో టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ సమక్షంలో ముదిగుబ్బ మండలంలోని ప్రధాన సమస్యలైన 30 పడకల ఆసుపత్రి, మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల, హిందూ స్మశాన వాటిక, ముస్లింల కబరస్తాన్, ఈద్గా సమస్యలు, శాశ్వత తాగునీటి పరిష్కారం, దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు పునర్నిర్మాణం లాంటి సమస్యలను మండల నాయకులు పరిటాల శ్రీరామ్ సమక్షంలో సత్య కుమార్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. సత్య కుమార్ వైద్య శాఖ మంత్రి కావడం సంతోషదాయకమని, ముదిగుబ్బలో సరైన వైద్య సౌకర్యాలు లేక బత్తలపల్లి, కదిరికి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, టీడీపీ హయాంలో మొదలుపెట్టిన ఆసుపత్రి నిర్మాణం గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిల్లులు మంజూరు చేయక మొండి గోడలకే పరిమితమైందని, సత్యకుమార్‌కు వైద్యశాఖ మంత్రి కావడంతో మండలంలోని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోపాల్‌రెడ్డి, కనుమ చంద్ర, చిరిగారిపల్లి రవి, అమీర్ భాష,బాలచంద్ర, కేతన ఆంజనేయులు, రవితేజ, లింగారెడ్డి పాల్గొన్నారు.

ముత్తుకూరులో వైద్య శిబిరం

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర–గుడిబండ: మండలం పరిధిలోని ముత్తుకూరులో వాంతి విరేచనాలతో వివిధ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని మంగళవారం విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురించడం తో వైద్య ఆరోగ్య సిబ్బంది స్పందించారు. ఈ సందర్భంగా గురువారం ముత్తుకూరు గ్రామంలో మండల అధికారులు పర్యటించి వాంతులు విరేచనాలకు గల కారణాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించిన అధికారులు డిఎల్ పి ఓ శివ నారాయణ రెడ్డి, ఎంపీడీవో బంగారమ్మ, ఈఓఆర్డి నాగరాజు నాయక్, ఆర్డబ్ల్యూఎస్ డిఈ,మనునాయక్, ఏఈ హరీష్, మెడికల్ ఆఫీసర్ భారతి ప్రజలకు వాంతి వీరేచనాలు ఇంకా ఉధృతం కాకుండా నిరోధించటానికి ఆరోగ్య సిబ్బందికి తగు సూచనల సలహాలు అందించారు.అదేవిధంగా గ్రామంలోని పరిసరాలను పరిశీలించి గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. పారిశుధ్యం పై స్థానిక పంచాయతీ అధికారులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జగదాంబ కృష్ణప్ప, పంచాయతీ కార్యదర్శి అరుణ, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

25న పశువుల సంత వేలంపాట

విశాలాంధ్ర–గుడిబండ: మండల కేంద్రంలో వారపు పశువుల సంత వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ వేలంపాటలో పశువుల సంతకు డిపాజిట్టుగా 5 లక్షలు, కూరగాయల సంతకు లక్ష రూపాయలు, దినసరి బస్టాండ్‌కు రూ.60 వేలు, 5 షాపింగ్ కాంప్లెక్స్‌లకు రూ.6500, తాగునీటి పరిశుద్ధ కేంద్రాలు రెండుకు గాను రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో ఆసక్తి గల వ్యక్తులు పాల్గొన్నానని అలాగే గ్రామపంచాయతీకి ఎటువంటి బకాయిలు లేకుండా ఉన్నట్టుండి వ్యక్తులు అర్హులు అవుతారని తెలిపారు.

పోలీస్ అధికారులకు అభినందనలు

విశాలాంధ్ర– పెనుకొండ : సార్వత్రిక ఎన్నికలు 2024 పెనుకొండ మండలంలో ప్రశాంతమైన ఎన్నికలు నిర్వహించినందుకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేసిన నందున గురువారం సత్యసాయి ఎస్పీ మాధవరెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో బాగా పనిచేసిన పోలీసు అధికారులకు ప్రశంసా పత్రంతో పాటు సత్కరించారు. ఈ సత్కారానికి పెనుకొండ ఎస్సై రాజేష్ ఎంపికయ్యారు. ఆయనను ఎస్పీ మాధవరెడ్డి అభినందనలు తెలుపుతూ ప్రశంసాపత్రంతో సత్కరించారు.